క్లుప్తంగా

రంగనాథుడి ఆశీస్సులు అందరికీ ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రంగనాథుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో గురువారం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. తెన్నేటి నరసింహారావు కుటుంబ సభ్యులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. గోదాదేవికి కుంకుమ, పసుపుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

సచివాలయాల్లో రుణమాఫీ గ్రూపుల జాబితా

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థిక చేయూత అందించడానికి పొదుపు సంఘాల రుణాల మొత్తాన్ని తీర్చడానికి చర్యలు తీసుకుంటోందని వీఎంసీ పట్టణ సాధికారాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి శకుంతల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండు విడతలుగా గ్రూపుల ఖాతాలకు సొమ్ము జమ చేశామని, మూడో విడతకు అర్హత ఉన్న గ్రూపుల జాబితాను సోషల్ ఆడిట్‌లో ఉంచామని, నగరంలోని అన్ని సచివాలయాల్లో జాబితా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. దానిలో మార్పులు, చేర్పులు ఉంటే ఈ నెల 8వ తేదీ సాయంత్రంలోపు వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ విభాగంలో సమర్పించాలని సూచించారు.

వీఎంసీ ఏడీహెచ్ బదిలీ

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ఉద్యానవన విభాగం అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి. శ్రీనివాసును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను కర్నూలు ఉద్యానవన విభాగం అధికారిగా బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది డిసెంబర్‌లో ఇక్కడికి వచ్చిన శ్రీనివాసు ఏడాదిపాటు వీఎంసీలో విధులు నిర్వహించారు.

ఏఈకి షోకాజ్ నోటీసు

ఉద్యానవన విభాగంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న పుల్లారావుకు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించటం, ఇటీవల ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు రాజీవ్‌గాంధీ పార్కును సందర్శించిన సందర్భంలో పార్కులో వాటర్‌పాండ్ మురికిగా ఉండటం, ఎక్కడపడితే అక్కడ మట్టిని వదిలేయటం తదితర సమస్యలను తీర్చాలని కమిషనర్ ఆదేశించినా వాటిని పరిష్కరించకపోవటంతో షోకాజ్ నోటీసులు అందించారు.

11న ఎస్ఎన్‌పురం స్టేషన్‌లో వాహనాల వేలం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన నాలుగు టూ వీలర్లు, ఒక ఫోర్ వీలర్ వాహనాలను జనవరి 11వ తేదీ ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకటనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు టూ వీలర్‌కు రూ. 5వేలు, ఫోర్ వీలర్‌కు రూ. 10వేలు రిఫండబుల్ డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాల్సిందిగా సూచించారు. పాడుకున్న పాటకు అదనంగా 18శాతం జీఎస్టీ చెల్లించాల్సింది ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 92916 84654, 90306 01135 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీటీసీ కార్యాలయంలో బ్యాడ్మింటన్ కోర్టు



విజయవాడ స్పోర్ట్స్/గాంధీనగర్: డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(డీటీసీ) ఎం.పురేంద్ర గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు, శారీరక దృఢత్వం సాధించేందుకు క్రీడలు దోహదపడతాయని డీటీసీ చెప్పారు. వయసు తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని కార్యాలయ ఉద్యోగులకు సూచించారు. కార్యాలయ ప్రాంగణంలోనే బ్యాడ్మింటన్ కోర్టును ఏర్పాటు చేసిన రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం.రాజబాబును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీవో ఆర్.జగదీశ్వరరాజు, ఎంవీఐలు ఆర్.ప్రవీణ్, ఎస్.శ్రీనివాస్, బి.చల్లారావు, ఉద్యోగ సంఘ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్, కె.వి.వి.నాగమురళి పాల్గొన్నారు.

8న గోదా కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ ఇందిరా ఎన్‌క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఇందిరా ఎన్‌క్లేవ్‌లో గోదా కల్యాణం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.సాంబశివరాజు, కె.వేణుగోపాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లుగా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కల్యాణం చేస్తున్నామని పేర్కొన్నారు.

పింఛన్‌తో పేదలకు భరోసా

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక రూపంలో అందిస్తున్న నగదు ఎందరో పేదల జీవితాలకు భరోసాగా నిలుస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అరండల్‌పేటలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం పింఛన్ వారోత్సవాలు నిర్వహించారు. 1, 23, 24, 25 డివిజన్లకు సంబంధించి కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ పెన్షన్ కానుక వృద్ధులు, వికలాంగుల జీవితంలో వెలుగులు నింపుతోందన్నారు. పెన్షన్ పెంపును టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఒకటో డివిజన్‌లో 49 మందికి, 23వ డివిజన్లో 14 మందికి, 24వ డివిజన్‌లో 19 మందికి, 25వ డివిజన్‌లో 28 మందికి మొత్తం 110 కొత్త పింఛన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 1,764 మందికి నోటీసులు ఇవ్వగా వారిలో 1,074 మంది ఇప్పటికే పింఛన్లు అందుకున్నారని చెప్పారు. కేవలం ఆదాయ పన్ను చెల్లించే వారికి, కార్లు ఉన్న వారికి మాత్రమే పింఛన్‌ను నిలిపివేసినట్లు తెలిపారు. టీడీపీ హయాంలో అర్హత ఉన్నా పింఛన్ వచ్చేది కాదని మల్లాది విష్ణు గుర్తుచేశారు. ఆ విధానానికి స్వస్తి పలుకుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు ఒకటో తేదీనే పింఛన్ సొమ్మును ఇంటింటికీ అందజేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలకు మూడు నెలల ముందు వరకు 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేస్తే వైఎస్ జగన్ సీఎం అయ్యాక సంతృప్త స్థాయిలో అర్హులందరికీ వంద శాతం పింఛన్ల మంజూరు చేసే విధానం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, జోనల్ కమిషనర్ జి.సుజనా, సీడీశ్వరి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు బంకా శకుంతల, కుక్కల అనిత, ఉద్దంటి సునీత, నాయకులు ఒగ్గు విక్కీ, బంకా భాస్కర్, వడ్డీ వాసు, అబ్దుల్ నజీర్, అలీ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 2 వ డివిజన్ 209వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం నాలుగో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, అధికారులతో కలిసి ఆయన గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయన కూలిన సైడ్ డ్రెయిన్ల పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మధురానగర్‌ను మోడల్ డివిజన్‌గా తాము తీర్చిదిద్దగా, గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు అభివృద్ధి చేయాలని మల్లాది విష్ణు అన్నారు. డివిజన్లో దొంగ బాండ్లను అమ్మిన చరిత్ర టీడీపీ నేతలదని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వంలో సీసీ రోడ్లు, యూజీడీ, కర్మల భవన్ సహా అభివృద్ధి పనులతో మధురానగర్ ముఖచిత్రమే మారిపోయిందన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు ప్రచారపిచ్చి పట్టిందని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఇరుకు సందులు, రోడ్లపై మీటింగ్‌లు పెట్టవద్దని జీవో ఇస్తే.. దాన్ని అగౌరవపరిచేలా మాట్లాడటం బాబుకు తగదని హితవు పలికారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ జి.సృజన, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలి



పాద పూజ కార్యక్రమంలో గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. ముత్యాలంపాడులోని సాయిబాబా మందిరంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన శ్రీ విష్ణు సహస్రనామ పారాయణమండలి సభ్యులు తాడేపల్లి మల్లికార్జునరావు ఉదయలక్ష్మి కళ్యాణి దంపతుల సహకారంతో పుణ్యదంపతులకు పాదపూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన 51 మంది పుణ్య దంపతులను గుర్తించి వారిని సత్కరించటం అభినందనీయమన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మూడున్నరేళ్లలో రూ.29.67కోట్లతో అభివృద్ధి



రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు,డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన 30వ డివిజన్‌లో మూడున్నరేళ్లలో రూ. 29.67 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో రూ. 80లక్షల వ్యయంతో బుడమేరు వంతెన నుంచి దేవీనగర్ రైల్వేట్రాక్ వరకు నిర్మించిన నూతన ప్రధాన రహదారిని గురువారం నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, ఏఈ అరుణ్ కుమార్, నాయకులు మార్తి చంద్రమౌళి, అమ్ముల వివేకానంద, దుర్గారావు, రామకృష్ణాపురం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు నిర్మాణ పనులు



తారురోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగర సుందరీకరణపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. సింగ్‌నగర్ 58వ డివిజన్‌లోని సిద్ధార్థనగర్‌లో జరుగుతున్న తారురోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీ, నందమూరినగర్, భారతమాత మందిరం రోడ్డు, ఇందిరానాయక్ నగర్ పరిసర ప్రాంతాల్లో రహదారుల ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని వివరించారు.

● ఆకట్టుకుంటున్న గులాబీల ప్రదర్శన



నగరపాలక సంస్థ, హరితప్రియ ప్లాంట్ లవర్స్ సొసైటీ, రోజ్ సొసైటీ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో రాష్ట్రస్థాయి అగ్రి హార్టికల్చర్ షో, ఐదవ వార్షిక గులాబీ ప్రదర్శన ఆకట్టుకుంటోంది. దీన్ని గురువారం కలెక్టర్ ఢిల్లీరావు, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీసీపీ మేరీ ప్రశాంతి ప్రారంభించారు. వివిధ రకాల గులాబీ మొక్కలు కనువిందు చేస్తున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పెద్ద వరమని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 24వ డివిజన్ కస్తూరిభాయిపేటకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన గరికపాటి స్నేహిత(17) అనే యువతి ఇటీవల బోన్ మ్యారో సర్జరీ చేయించుకుంది. ముఖ్యమంత్రి సహాయనిధికి దరకాస్తు చేసుకోగా వారికి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే మల్లాది విష్ణు సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో గురువారం బాళిక కుటుంబ సభ్యులకు అందజేశారు. పేదల ఆరోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు.

కోడి పందేల కత్తులు ఉన్న వ్యక్తి అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): కోడి పందేలకు ఉపయోగించే కత్తులు కలిగివున్న వ్యక్తిని నున్న రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అంబాపురం గ్రామానికి చెందిన శెనగశెట్టి విజయబాబు అనే వ్యక్తి సంచిలో కోడికత్తులతో అనుమానాస్పదంగా తిరుగుతూ సుందరయ్యకట్ట వద్ద 4వ తేదీ కనిపించాడు. ఎస్ఐ గోవింద బాబు అతన్ని ఇంటికి తీసుకెళ్లి తనిఖీ చేయగా కోడిపుంజులకు కట్టే కత్తులు తయారు చేసే మిషన్‌ను 1007 కత్తులను స్వాధీన పర్చుకొని, అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

దాసాంజనేయుడి హుండీ ఆదాయం రూ.7.84 లక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో భక్తులు స్వామివారికి హుండీల ద్వారా సమర్పించిన కానుకల ఆదాయం రూ. 7.84 లక్షల నగదు, 55గ్రాముల వెండి, 5 దుబాయ్ దీనార్స్, 4 యూఎస్ డాలర్లు లభించాయి. మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో గురువారం కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం ఈఓ సీతారామయ్య, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. 78 రోజులకు ఈ ఆదాయం లభించినట్లు ఈఓ నాగినేని భవాని తెలిపారు. ధర్మకర్తలు కగ్గా పాండు రంగారావు, బండి నాగజ్యోతి , కోలా సూరాంబ, యక్కల మారుతి, సత్యవతి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఆధారిత కోర్సులకు ప్రాధాన్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉపాధి ఆధారిత కోర్సులకు ప్రాధాన్యమిచ్చి విద్య పూర్తయ్యేసరికి ఉపాధి లభించేలా చూడాల్సిన బాధ్యత కళాశాలలపై ఉందని ఎన్టీఆర్ జిల్లా ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ వీరశేఖర్ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కమిషనరేట్ ఆధ్వర్యాన అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధిపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల్లో నైపుణాన్ని పెంపొందించడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యావిధానంలో మార్పులు రావడంతో తొలివిడతగా 11 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని 55 మంది అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం శిక్షణ కార్యనిర్వహణాధికారిగా వ్యవహరించారు.

లక్ష్యాలు చేరుకోవాలి

విద్యార్థులను లక్ష్యాలు చేరుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ ఆకాంక్షించారు.శిక్షణ కార్యక్రమంలో అధ్యాపకులను ఉద్దేశించి ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించారు.

ప్రతిభ చాటుతున్న దివ్యాంగులు



మాట్లాడుతున్న నిడుమోలు రమాసత్యనారాయణ, చిత్రంలో ప్రసూనా రామన్, తదితరులు

విజయవాడ కల్చరల్: అన్ని రంగాల్లో దివ్యాంగులు ప్రతిభ చాటుతున్నారని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. అభినేత్ర ఫౌండేషన్ వికలాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద గురువారం బ్రెయిలీ జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కామినేని ఉమాశంకర్, బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, డాక్టర్ భాగ్యశ్రీ పాల్గొన్నారు.

మరింత మెరుగైన విద్యకే ట్యాబ్‌లు

కలెక్టర్ ఢిల్లీరావు



ట్యాబ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించడానికి ట్యాబ్‌లు దోహదపడతాయని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. నగరంలోని బిషప్ అజరయ్య హైస్కూల్‌లో గురువారం 8వ తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల పని తీరు, విద్యార్థులు ఉపయోగిస్తున్న విధానాన్ని కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు.

కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు డిజిటల్ విద్య అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసిందన్నారు. జిల్లాలో 8వ తరగతి చదువుతున్న 14 వేల మందికి పైగా విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. బయాలజీ సబ్జెక్టుకు సంబంధించి కొన్ని అంశాలను విద్యార్థులకు కలెక్టర్ బోధించారు. టెన్త్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీవీఆర్ స్కూల్లో పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని లేకపోతే బిల్లు చెల్లించబోమని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ స్పష్టం చేశారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన 23 డివిజన్ సీవీఆర్ హైస్కూల్లో నాడు–నేడులో జరుగుతున్న రూ.1.50 కోట్ల పనులను ఆయన పరిశీలించారు. పాఠశాల నూతన భవనాన్ని, నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనులను ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం ఆయన 62, 64వ డివిజన్లలో డ్రెయిన్లను పరిశీలించారు. ఈ పర్యటనలో డీఈ గురునాథ్, ఇతర అధికారులు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు .

వ్యాధిపీడితులకు నాణ్యమైన వైద్యసేవలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుహాసిని

ఆటోనగర్(విజయవాడతూర్పు): వ్యాధిపీడితులకు నాణ్యమైన వైద్యసేవలు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్) లకు సూచించారు. ఏపీఐఐసీ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎంఎల్‌పీహెచ్‌ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సుహాసిని మాట్లాడుతూ చెవి, గొంతు, ముక్కు తదితర వ్యాధులతో పాటు మానసిక సమస్యల బారిన పడిన వారిని గుర్తించి మెరుగైన వైద్యసేవలను అందించడానికి కృషి చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలతో పాటు తదితర అంశాలపై మిడిలెవల్ హెల్త్ ప్రొవైడర్‌లకు అర్థమయ్యే రీతిలో వివరించారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ నవీన్, వైద్యులు సుష్మా, కళ్యాణ్, నరేష్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్యుల సంఘానికి నూతన కార్యవర్గం



డాక్టర్ పి.శ్వేత



డాక్టర్ కేఎస్సాఆర్ భార్గవ

లబ్బీపేట(విజయవాడతూర్పు): అసోసియేషన్ ఆఫ్ ఓటో రైనో లారింగాలజిస్ట్స్ ఇండియా–ఏఓఐ(అఖిల భారత చెవి ముక్కు గొంతు వైద్యుల సంఘం) విజయవాడ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో 2023–24కు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా డాక్టర్ పి.శ్వేత, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ప్రదీప్, కార్యదర్శిగా డాక్టర్ కేఎస్సార్ భార్గవ్, సహకార్యదర్శిగా డాక్టర్ పవన్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ సమీర నియమితులయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా డాక్టర్ సుధ, డాక్టర్ అఖిల సుల్తానా, డాక్టర్ వెంకయ్య, డాక్టర్ దినేష్ ఎన్నికయ్యారు. రిటర్నింగ్ అధికారిగా డాక్టర్ శివరామకృష్ణ వ్యవహరించారు. 2022–23కు సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా చేసిన డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్వేత అందించిన సేవలను కొనియాడారు. సంఘం కార్యక్రమాలను సమాజంలోకి తీసుకు వెళ్లడానికి పూర్తి నిబద్ధతతో పని చేస్తామని నూతన అధ్యక్షురాలు డాక్టర్ శ్వేత తెలిపారు.

అలరించిన స్వర నీరాజనం



గీతాలు ఆలపిస్తున్న శ్రీనివాసరావు, వరలక్ష్మి, శ్రేయ, తదితరులు

విజయవాడ కల్చరల్: అమరగాయకుల సేవలు సదా స్మరణీయమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత పసుపులేటి శ్రీనివాసరావు అన్నారు. స్వరాభిషేకం సంగీత సాహిత్యసేవ సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం ఘంటసాల, భానుమతి, బాలసుబ్రహ్మణ్యం తదితర గాయకుల స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఘంటసాలలాంటి గాయకులు తెలుగు సినీ చరిత్రలో అరుదుగా కనిపిస్తారన్నారు. గాయకుడు మీసాల బాబ్జి మాట్లాడుతూ సీనియర్ గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గాయకులు తణుకు వరలక్ష్మి, శేషం శ్రేయ, మదుకూరు శ్రీనివాసరావు, నేరెళ్ల రమేష్ పలు సంప్రదాయ గీతాలను ఆలపించారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

నున్న(విజయవాడ రూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పలు గ్రామాల్లో విఫ్స్ ప్రోగ్రామ్(వీక్లీవన్స్)జరిగింది. మండలంలో హైస్కూల్ ఎలిమెంటరీ స్కూల్స్ విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి ఐరన్ టాబ్లెట్లు అందజేశారు.